
# ఓటమి

గంధం యాజ్ఞవల్క్య శర్మ

ప్రొద్దున్నే భుజంగరావుగారు స్నానం జపం చేసి వరండాలో కుర్చీమీద కూర్చొని భగవద్గీత చదువుకొంటున్నారు. అంతలోనే బావమరిది మాధవయ్య త్రాగుతున్న చుట్టను గోడవతల పారవేసి వచ్చి, భుజంగరావు గారి ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. భుజంగరావుగారు మౌనంగా చదువుకొంటూనే ఉండిపోయారు.

కొద్ది క్షణాల తరువాత మాధవయ్యే మొదలు పెట్టాడు—"పొలం పోయేవాడిని మీతో




'సత్యం, నిష్కల్మష హృదయం—ఇవి భగవంతుని రూపాలు. వీటి ముందు, కాంతి ముందు ఓడిపోయే చీకటిలా ఓటమి ఓడిపోతుంది.' సాధ్యమేనా?

మాట్లాడదామని ఇలా వచ్చాను బావా" అంటూ.

చదువుతున్న శ్లోకం ముగించి 'ఏమిటి' అన్నట్టు చూచారు భుజంగరావుగారు.

మాధవయ్య నలభయ్యవ పడిలో పడినా బావ భుజంగరావుగారితో మాట్లాడటమంటే కొంచెం బిడియమే. కారణం అతనికి బావగారి యెడల గల గౌరవ ప్రపత్తు లలాంటివి.

"అదే.. మురారి ఎలక్షనులో నిలబడతానంటే వద్దన్నానట... వాడుమాత్రం ఏమన్నా ఉద్యోగం చేయాలా, మరేమన్నానా? ఏదో ఇంత ప్రజా సేవ చేస్తానని ఉత్సాహపడుతున్నాడు. కాదనటం ఎందుకు? పైగా వాడే నిలబడాలి కాని, గ్రామం గ్రామం వాడికి కిరీటం పెట్టదూ..." అన్నాడు మాధవయ్య.

భుజంగరావుగారు గంభీరంగా ఉండిపోయారు. "అది కాదు బావా! వాడూ ఇంత చదువుకున్న వాడు. జ్ఞానాన్ని ఆర్జించినవాడు. అలాంటివాడికి ప్రోత్సాహమిస్తే పైకి వెళతాడు...." అన్నాడు మళ్ళీ మాధవయ్య.

భుజంగరావుగారు సూటిగా మాధవయ్య కళ్ళలోనికి చూచారు. ఆ చూపులో ఏ భావ ముందో మాధవయ్యకు బోధపడలేదు. అంగీకారము,అనంగీకారము ఏదీ తెలియపరచని భుజంగ రావుగారు మళ్ళీ గీతాపారాయణంలో మునిగి పోయారు.

"వస్తాను. పొలంలో పని మనుషులను పంగించి వచ్చాను" అంటూ మాధవయ్య వెళ్ళిపోయాడు.

భుజంగరావుగారు పునులూరు గ్రామంలో మోతుబరి. చదువు సంస్కారం గల వ్యక్తి. ఆనాడు స్వాతంత్ర్యోద్యమంలో, గాంధి మహాశయుని శంఖారావంవిని దేశంకోసం నడుముకట్టిన త్యాగి. జాతీయ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తూ దేశం పిలిచిందంటూ ప్రాణా లొడ్డటానికి సాహసించిన దేశభక్తుడు.

దేశం స్వాతంత్ర్యాన్ని పొందాక రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పి, వ్యవసాయం చేయించు కొంటూపునులూరులోనే నివాసం ఉడిపోయారు. ఆ గ్రామంలో భుజంగరావుగారంటే అమిత గౌరవం భక్తి ప్రపత్తులు ఉండేవి. ఆయన మహా జ్ఞానిగా పరిగణింపబడ్డారు.

మురారి భుజంగరావుగారి ఏకైక సంతానం. విశాఖ పట్నంలో పట్టభద్రుడై సెలవులకు పునులూరు చేరాడు. కళాశాల జీవితంలో కొద్దిగా రాజకీయ వాసనల చుట్టూ మసలిన వాడే. బి. ఎ. చదువుతూ ఉండగా విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నిక అయ్యాడు.

పునులూరు వచ్చాక ఒంటరిగా ఉండటానికి ఏదోగా ఉండేది. పై చదువుకు వెడదామని అనుకొన్నాడుగాని, భుజంగరావుగారు కుటుంబ బాధ్యతలను తాను మోయలేనని, ఇంటి పట్టున ఉండి మురారినే చూచుకోమని చెప్పారు. పైగా దేశంలో ఉద్యోగాలు చేసికొని బ్రదుకవలసిన వారు చాలమంది ఉన్నారు. వారికి ఉద్యోగాలు కాని నీ కెందుకని ప్రశ్నించారుకూడ. పట్టణ జీవితానికి అలవాటు పడిన మురారి, పల్లె జీవితమా! అనుకొన్నా, తండ్రిమాట కాదన లేక పోయాడు.

కొంతకాలం అలాగడిచే సరికి పునులూరులో నలుగురు తన దగ్గరకు రావటం, మంచీ చెడ్డా, రాజకీయాలూ కనుక్కోవటం ప్రారంభిం చారు. దానితో గ్రామ ప్రజలకు నాయకుడై వారి నందరిని ఎందుకు ముందుకు తీసికొని రాకూడదు అనిపించింది మురారికి.

మునసబు రంగయ్య ఆ మధ్య భుజంగరావు గారితో మాట్లాడుతూ, "ఈ పల్లె ప్రజ లేనాటికి పురోగమిస్తారు ? తమమీద ఉన్న ప్రజాస్వామ్య భారాన్ని ఏ నాటికి గుర్తిస్తారు? మన మురారి లాంటి యువకులు ముందుకు వచ్చి నడుం కట్టకపోతే ఎలాగు?" అన్నారు మాటల సందర్భంలో. మురారి తన ఆలోచన లను ఆనాటినుండి ఈ మార్గంలో ప్రసరింప చేశాడు. తాను గ్రామ పంచాయతీకి అధ్యక్షుడై పంచాయతీ సమితితో పోరాడి తన గ్రామానికి తగిన వసతులు కల్పించాలి.

ఆరు నెలలు తిరగకముందే గ్రామ పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. నలుగురూ ప్రోత్సహించారు. మురారి సర్వ సన్నద్ధుడైనాడు. కాని భుజంగరావుగారి అనుమతి కావాలి. మురారికి భుజంగరావుగారిదగ్గరకువెళ్ళి మాట్లాడ గల ధైర్యం, చనువు లేవు. అందుకే తల్లి జానకమ్మగారిచేత చెప్పించి చూచాడు.

"ప్రజాసేవ వాడికేం చేతనవుతుంది" అనేసి చదువుతున్న పుస్తకంలో మునిగిపోయారు భుజంగరావుగారు.

ప్రక్క గదిలో ఉండి వింటున్న మురారి మనస్సు చివుక్కుమంది. తన తండ్రిమీద ఉన్న భావం క్షణకాలం తొట్రుపడింది. ఏమైనా సరే పంచాయతీ ఎన్నికలకు నిలబడవలసిందే అని నిర్ణయించుకొన్నాడు. జానకమ్మగారు, ఆ గ్రామంలోనే ఉన్న తన అన్నగారు మాధవయ్య దగ్గరకు వెళ్ళి, మురారి కోరిక, భుజంగరావుగారి అభిప్రాయం చెప్పింది.


* * *

ఆనాడు అలా మాధవయ్య, భుజంగరావు దగ్గర ఆ విషయం ప్రస్తావించి, మరునాడు మరికొందరిచేత చెప్పించాడు.

"కుర్రవాడు. వాడికేం చేతనవుతుంది ? మీలో ఎవరైనా పెద్దలు స్వీకరించాలి ఆ బాధ్యతను"— అన్నారు భుజంగరావుగారు.

"కాదు, మురారే తగిన వ్యక్తి" అంటూ వాదించారు కరణం భద్రయ్యగారు, మునసబు రంగయ్యగారు . వారికి అండగా గ్రామంలో మరికొందరు ప్రముఖులు నిలబడి మాట్లాడారు.

"మీ ఇష్టం" అనేసి ఊరుకొన్నారు భుజంగ రావుగారు. అంతే. అక్కడ చేరిన వారంతా



మద్రాసు సెంట్రల్ స్టేషన్
ఫోటో—'భరద్వాజ '(మద్రాసు—18)

మురారి ఆ గ్రామానికి ఏకైక నాయకుడన్నారు. ఆ గ్రామాన్ని ఎలా అభివృద్ధి పొందించాలో సూచించారు కొందరు. మరి కొందరు పఠనాలయం, రేడియో, పంచాయతీ కార్యాలయం ఎక్కడ ఉండాలో విశదపరిచారు. మురారి నిలువెల్లా పొంగిపోయాడు, తన ప్రజా జీవితం భవిష్యత్తులో ఎలా సాగిపోవాలో ఊహించుకొని.

* * *

ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అర్థం చేసికోని దేశాలలో 'ఎన్నికలు' గాలివాట్లు.

ఈ నాటి సాయంత్రం మురారి ఏకైక నాయకుడన్నారు. తెల్లవారేసరికి..ఎక్కడో, ఏదో బయలుదేరి, గాలిపాటుకు 'ఎర' య్యె మరో పార్టీ లేచింది. కొన్ని సంవత్సరాలుగా ఆ గ్రామంలో పార్టీలు లేవు. అలాంటిది మరో పార్టీ ఉదయించింది.

ఎంతటి కోమల హృదయాలైనా రాజకీయాలలో పడేసరికి ఎంత విచిత్రంగా మారిపోతాయో! మురారిలో పట్టుదల ఎక్కువయింది. తానే ఎన్నికకావాలనే తృష్ణలో పడిపోయాడు.

ఎన్నికల ప్రచారాలు తీవ్రంగా కొనసాగాయి. ఇరు పక్షాల నుండి కాగితాలు, లౌడు స్పీకర్లు, ఏవేవో...

భుజంగరావుగారు అరవయి ఏళ్ళ జీవితాన్ని గౌరవంగా గడిపారు ఆ సీమలో. ఏనాడూ ఆయనకు ఎదురాడిన వ్యక్తిలేడా గ్రామంలో. అలాంటిది మురారి మూలంగా గ్రామ పార్టీలు, కక్షలు ఉద్భవించటం భుజంగరావుగారి కెలాంటి మనస్తాపాన్ని కల్గించాయో? ఏమో...ఎవరికి తెలుసు? ఆ గంభీరమూర్తిలో ఎలాంటి భావాలూ పొడచూపవు. ప్రాత: ఉషస్సులో లేచి, భగవద్ధ్యానం చేసుకొని, చేతిలో పుస్తకంతో ఊరి వెలుపల తోట పొలంలో రెండు పెదచింతల మధ్య కూర్చొనటం తప్ప, ఆయన మరే విష

# ఓటమి

యాలూ పట్టించుకోవటంలేదు.

మాధవయ్య, మునసబు రంగయ్యగారు, కరణం భద్రయ్యగారు ముగ్గురూ వచ్చి, భుజంగరావుగారిని ఒక్కటి అర్థించారు—"మీరు ఆ ప్రత్యర్థిని పిలిపించి మానుకొనమని చెప్పండి. మానుకొంటాడు. మీ ముందరపడిన తరువాత తప్పించుకోలేడు. మీరంటే గౌరవం అతనికి" అని.

భుజంగరావుగారు పొడిగా నవ్వారు. "నాకున్న విలువను వెలబెట్టి, ప్రజలు నిర్ణయించవలసిన దానిని నన్ను నిర్ణయించమంటారా? తప్పు—" అన్నా రాయన.

మురారి మనస్సు చివుక్కుమంది. తన తండ్రి రాజకీయవాది అని విన్నాడు. 'ఇదేనా ఆయన రాజకీయం......' అనే తేలిక భావం పొరలింది అతని మనసులో.

* * *

ఎన్నికలు వచ్చాయి. ఇరుపక్షాలు ఎంతో ధనాన్ని, కాలాన్ని వెచ్చించాయి. ఎన్నికలు జరిగిపోయాయి. మురారి కొద్ది తేడాతో ఓడిపోయాడు. మునసబు రంగయ్యగారు, కరణం భద్రయ్యగారు, మాధవయ్య ఇండ్లలోనుండి బయటకే రాలేకపోయారు.

మురారి అవమాన భారంతో క్రుంగిపోయాడు. దీని కంతకూ కారణం తన తండ్రే అనిపించింది. తనకన్నా ఆ ప్రత్యర్థి ఏ విషయంలోనూ ఆధిక్యం కలిగి కాదు గెల్చింది. తన తండ్రి ఏ మాత్రం మాట సహాయం చేసినా తనకీ ఓటమి కరిగేది కాదు. మురారికి భుజంగరావుగారిమీద పట్టరాని కోపం వచ్చింది. తన భవిష్యత్తును ఇలా నాశనంచేసిన తండ్రినుండి వేరైపోవటమే మేలనిపించింది. వెంటనే బయలుదేరాడు. వెళ్ళ

పోతూ ఒక్కసారి ఆయనతో చెప్పిపోవా లనుకొని, పొలంకేసి నడిచాడు.

సాయంత్రం కావస్తున్నది. పశ్చిమాన సూర్యుడు తన తీవ్రతను తగ్గించుకొని, సంధ్య కోసం ఎదురు చూస్తున్నాడు.

తోట పొలంలో రెండు చింతలమధ్య నీడలో కూర్చుని తదేక ధ్యానతో గీతా పారాయణం చేస్తున్న భుజంగరావుగారిని చూడగానే మురారి క్షణకాలం నిరుత్తరు డయ్యాడు. ఏ భావాన్నీ పైకి ప్రదర్శించలేక, "వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి. భుజంగరావుగారు, చేతిలోని పుస్తకాన్ని ప్రక్కన పెట్టి మురారిని సూటిగా చూచి, "మురారీ, ఓడిపోయానని పారిపోతున్నావా...." అన్నారు. ఆ పలుకులు ఎంతో గంభీరంగా ధ్వనించాయి. మురారి మారు మాటాడలేకపోయాడు.

పొడిగా నవ్వారు భుజంగరావుగారు.

"ప్రజాసేవ చేస్తానన్నావు......? ప్రజాసేవ అంటే పదవి కాదు. అధికార తృష్ణ అంతకన్నా కాదు నాయనా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూడు మన జాతిపిత నడిపిన ఉద్యమాన్ని.

"అరెస్టులు చేస్తామంటే లక్షలు వచ్చారు. కాల్పులు జరుపుతామంటే కోట్లు కదిలారు. మాన ప్రాణాలను త్యాగం చేశారు దేశంకోసం—ప్రజాసేవకోసం. వారు ఏ పదవులను ఆశించి, ఏ భోగాలను దృష్టిలో పెట్టుకొని చేశారంటూ ఏ త్యాగాన్ని? వారి ఆశయాలు, ఆదర్శాలు, నిష్కల్మష ప్రజాసేవలో జీవ మందాయి. పవిత్ర చిత్తశుద్ధి వారికి మనుగడగా నిల్చింది. ప్రతిఫలం వాంఛించని ప్రజాసేవకు వారి జీవితాలు కైంకర్యం చేయబడ్డాయి.

"మురారీ, వారితో ఒక్కసారి పోల్చి చూచుకో నీ వెక్కడ ఉన్నావో. ఆత్మశుద్ధి చేసుకో. అంతే చాలు. నీకు పదవితో పనిలేదు. ప్రజాసేవ నిష్కల్మష హృదయంతో ఆచరించు. ప్రతిఫలంగా, ధన సంపదలనే కాదు—కీర్తిని కూడ ఆశించకు. ఆనాడు నీవు ఉత్తమ ప్రజాసేవకుడవు కాగలవు. ఓటమి అంటే ఏమిటో నీకు కన్పించదు.

"సత్యం, నిష్కల్మష హృదయం—ఇవి భగవంతుని రూపాలు. వీటిముందు, కాంతి ముందు ఓడిపోయే చీకటిలా 'ఓటమి' ఓడిపోతుంది" భుజంగరావుగారు లేచి వెళ్ళిపోయారు.

మురారిలో ఏదో సంచలనం బయలుదేరింది. శరీరంలోని ప్రతి అణువూ కదిలింది. హృదయం పశ్చాత్తాపంతో క్రుంగిపోయింది. పశ్చిమాద్రిని అస్తమిస్తున్న సూర్యుడు ఎర్రగా కన్పించి, తనను చూచి నవ్వినట్లనిపించింది.

గాలికి రెప రెపలాడుతున్న గీతను, చేతిలోనికి తీసికొన్నాడు మురారి. "అర్జునా, ప్రతిఫల వాంఛ లేకుండ కర్మను ఆచరించు—" అనే గీతా వాక్యం కన్పించింది.

మురారి "నే ఓడిపోలేదు—" అని గొణుక్కుంటూ గృహోన్ముఖుడయ్యాడు. ★

ఏకాంతం

చిత్రం—టి. జానకిదేవి (అనపర్తి)

